క్లుప్తంగా

మాజీ ఉపరాష్ట్రపతికి సన్మానం



వెంకయ్యనాయుడును సన్మానిస్తున్న ఉదయగిరి వాసులు

వరికుంటపాడు: మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడుకు భారత ప్రభుత్వం పద్మవిభూషణ్ బిరుదును ఇవ్వడంపై కర్ణాటక ఫిల్మ్ సెన్సార్ బోర్డు మాజీ సభ్యుడు, నియోజకవర్గ బీజేపీ నేత గంగవరపు సుబ్బారావు ఆధ్వర్యంలో బుధవారం బెంగళూరులోని రాజ్‌భవన్‌లో ఆయనను కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు నియోజకవర్గంలో ప్రస్తుత పరిస్థితులపై చర్చించారు. వెంకయ్యనాయుడును కలిసిన వారిలో ఉదయగిరి వాసులు కె.వెంకటేశ్వరరావు, లక్ష్మీరెడ్డి, మోహన్‌రావు, కె.దామోదర్, తదితరులున్నారు.

ఎమ్మెల్యే మేకపాటి పరామర్శ



చంద్రశేఖర్‌రెడ్డి చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే

చేజర్ల: మండలంలోని ఏటూరులో ఇటీవల మృతి చెందిన ఉట్లపల్లి చంద్రశేఖర్‌రెడ్డి కుటుంబ సభ్యులను ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. చంద్రశేఖర్‌రెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందారని తెలుసుకుని ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. చంద్రశేఖర్‌రెడ్డి ఆర్‌వైపాళెం పంచాయతీ సెక్రటరీగా పనిచేస్తున్నారు. ఆయన వెంట ప్రజా ప్రతినిధులు, నాయకులు ఉన్నారు.

నేడు ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి విజయీభవ యాత్ర

చేజర్ల: మండలంలోని ఆదూరుపల్లిలో ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి 15న గురువారం విజయీభవ యాత్ర నిర్వహిస్తారని ఎమ్మెల్యే కార్యాలయ ప్రతినిధులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వివిధ అభివృద్ధి పనులను ప్రారంభిస్తారన్నారు. మండలంలోని పార్టీ కార్యకర్తలు, అభిమానులు, నాయకులు హాజరు కావాలని కోరారు.

జేఈఈ మెయిన్స్‌లో సత్తా



ఉదయగిరి: మండలంలోని కోటాయిపల్లి అంగన్‌వాడీ కార్యకర్త కుమారుడు దుద్దుకూరు మోహన్ జేఈఈ మెయిన్స్‌లో 93.20 పర్సంటైల్‌తో సత్తా చాటారు. సామాన్య మధ్యతరగతి కుటుంబానికి చెందిన విద్యార్థి ప్రభుత్వ పాఠశాలల్లో చదివి మంచి ప్రతిభ కనబరచడంపై తోటి ఉద్యోగులు అభినందనలు తెలిపారు. తండ్రి కూలీ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు.

అభయాంజనేయస్వామికి మేకపాటి ప్రత్యేక పూజలు



మేకపాటిని ఆశీర్వదిస్తున్న అర్చకులు

దుత్తలూరు: మండలంలోని వెంకటంపేటలో ఉన్న ప్రసిద్ధ అభయాంజనేయస్వామి ఆలయంలో బుధవారం మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆయనకు స్వాగతం పలికి వేద ఆశీర్వచనం అందించారు. ఆయన వెంట స్థానిక నాయకులు ఉన్నారు.

ఓపెన్ డిగ్రీ దరఖాస్తులకు ఆహ్వానం

ఆత్మకూరు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో ఓపెన్ డిగ్రీ చదివేందుకు మార్చి 31వ తేదీ లోపు దరఖాస్తులను చేసుకోవాలని ఆత్మకూరులోని ఎస్‌ఆర్‌జేడీ కళాశాల స్టడీ సెంటర్ నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, ఐటీఐ, ఒకేషనల్ రెండు సంవత్సరాల కోర్సు పూర్తి చేసిన వారు ఓపెన్ డిగ్రీ చేసేందుకు అర్హులని ఆత్మకూరు కో ఆర్డినేటర్ తెలిపారు. మరిన్ని వివరాల కోసం 7382929793లో సంప్రదించాలన్నారు.

డీవీఎంసీ మాజీ సభ్యుడిపై కేసు నమోదు

ఆత్మకూరు: జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ (డీవీఎంసీ) మాజీ సభ్యుడు ఎస్‌కే రసూల్‌పై కేసు నమోదు చేసినట్లు ఆత్మకూరు పోలీసులు బుధవారం రాత్రి తెలిపారు. గతంలో ఆత్మకూరులో ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడిని బెదిరించి సుమారు రూ.3.50 లక్షలు తీసుకున్నాడని బాధితుడు నెల్లూరు ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేయడంతో ఆయన ఆదేశాల మేరకు విచారణ చేపట్టి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ప్రతి గ్రామం రాజధానిగా అభివృద్ధి

- అనంతసాగరంలో రూ.37.34 కోట్లతో సంక్షేమాభివృద్ధి
- ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి
- ప్రభుత్వ కార్యాలయాలు ప్రజలకు అంకితం



బైక్ ర్యాలీగా సాగుతున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి

సోమశిల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి గ్రామాన్ని రాజధానిగా మార్చారని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. బుధవారం అనంతసాగరంలో విజయీభవయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మతో కలిసి మేకపాటి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు. తొలుత జెడ్పీటీసీ సభ్యుడు రాపూరు వెంకటసుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత ఊరిబిండి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీతో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. గ్రామంలో దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం ఒకే ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని, రాజధాని పేరుతో రూ.5 లక్షల కోట్ల కుంభకోణానికి పాల్పడిందన్నారు. ప్రజాసంక్షేమాన్ని విస్మరించారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అయినప్పటి నుంచి ప్రజాసంక్షేమానికే పెద్ద పీట వేశారని, ప్రతి గ్రామాన్ని రాజధానిగా అభివృద్ధి చేసే లక్ష్యంతో గ్రామ స్వపరిపాలనకు నాంది పలికారని, సచివాలయం, రైతు భరోసా కేంద్రాలు వంటి ప్రభుత్వ వ్యవస్థలను గ్రామాల్లో ఏర్పాటు చేశారన్నారు. ఓ వైపు అభివృద్ధితో పాటు మరో వైపు సంక్షేమ పథకాల ద్వారా ప్రజలను ఆర్థికంగా అభివృద్ధి చేశారన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన తీరును దేశంలోని మిగతా రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుని అమలు చేస్తున్నాయన్నారు. కరోనా విపత్తు రెండేళ్లు పోతే మిగిలిన మూడేళ్లలోపే రాష్ట్రంలో అభివృద్ధిని కొత్త పుంతలు తొక్కించారన్నారు. నేటి తరమే కాదు.. భావితరాల భవిష్యత్‌కు విద్య రంగంలో బలమైన పునాదులు వేశారన్నారు. మరో ఐదేళ్ల తర్వాత రాష్ట్రంలో పేదరికమనే మాటే వినిపించదని, ప్రతి కుటుంబం లక్షాధికారుల జాబితాలో చేరడం ఖాయమన్నారు. ఒక్క అనంతసాగరం పంచాయతీకి ఇప్పటి వరకు రూ.37.34 కోట్లు నిధులను సంక్షేమాభివృద్ధి కోసం ముఖ్యమంత్రి జగనన్న అందజేసినట్లు వివరించారు. గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా రూ.80 లక్షలు, వైఎస్సార్ జలకళ ద్వారా రూ.15 లక్షలు, ఎంపీ నిధుల ద్వారా రూ.4 లక్షలను అభివృద్ధి పనులకు అందజేశామని, శ్రీవాణి ట్రస్టు ద్వారా దేవాలయాల నిర్మాణాలకు రూ.20 లక్షలు అందజేశామని, కలెక్టర్‌తో జరిపిన సమీక్షలతో అనంతసాగరం మండలంలో దాదాపు 367 మంది రైతులకు లబ్ధి చేకూరినట్లు వివరించారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధిని, సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని మీరందరూ జగనన్నను, తనను ఆశీర్వదిస్తే ఆయన సారథ్యంలో ఆత్మకూరు నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పథంలోకి నడిపిస్తానన్నారు. తొలి పది స్థానాల్లో ఆత్మకూరు నియోజకవర్గాన్ని నిలబెడతానని, అందులో అనంతసాగరం మండలాన్ని ప్రథమ స్థానంలో నిలబెడతానన్నారు.

పలు భవనాలు ప్రారంభం



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

అనంతసాగరంలో నిర్వహించిన విజయీభవ యాత్రలో పలు అభివృద్ధి పనులను జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభోత్సవాలు నిర్వహించారు. రూ.20 లక్షలతో నిర్మించిన పశు వైద్యశాల భవనంతో పాటు ఏడీఎఫ్ నేతృత్వంలో అనంతసాగరం మాజీ జెడ్పీటీసీ బుట్టి వెంకట కృష్ణారెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు రూ.15 లక్షలతో నిర్మించిన పంచాయతీ బస్టాండ్, ప్రముఖ పారిశ్రామికవేత్త పీ రాందాస్ రూ.2.50 లక్షలతో నిర్మించి 108 అంబులెన్స్ ఉద్యోగుల వసతి గృహ భవనం, రూ.35 లక్షలతో నిర్మించి సచివాలయం, రూ.37.50 లక్షలతో నిర్మించిన మేకపాటి గౌతమ్‌రెడ్డి జిల్లా ప్రజాపరిషత్ భవనాలను ప్రారంభోత్సవాలు నిర్వహించారు.

శక్తివంచన లేకుండా ప్రజలకు సేవలందిస్తా

- సమన్వయకర్త మేకపాటి



రచ్చబండ కార్యక్రమంలో మాట్లాడుతున్న మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

ఉదయగిరి: తన శక్తివంచన లేకుండా ఉదయగిరి అభివృద్ధికి కృషి చేస్తూ, ప్రజలకు సేవలందిస్తానని నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. ఆయన బుధవారం ఉదయగిరి పట్టణంలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఆయన ముందుగా దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, దర్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఆయన సినిమా హాల్ వీధి, ఎస్సీ, ఇందిరానగర్ కాలనీల్లో ప్రజలను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రజాసమస్యలు గుర్తించి పరిష్కరించేందుకే రచ్చబండ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. తమది రాజకీయ కుటుంబమన్నారు. మా అన్న మేకపాటి రాజమోహన్‌రెడ్డి 43 ఏళ్ల క్రితం ఎమ్మెల్యే పోటీ చేశారు. ఈ ప్రాంతంలో ప్రతి ఒక్కరు చదువుకోవాలని, విద్యతోనే అభివృద్ధి చెందుతుందనే ఉద్దేశం, ప్రజల కోరిక మేరకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు ఏర్పాటు చేయించారన్నారు. డిగ్రీ కళాశాల, ఇంజినీరింగ్ కళాశాలలో చదివిన ఎంతో మంది నేడు వివిధ శాఖల్లో ఉద్యోగులుగా పని చేస్తున్నారన్నారు. మా సోదరుడు శక్తివంచన లేకుండా ఎన్నో అభివృద్ధి పనులు చేశారన్నారు. మా కుటుంబం తర్వాత వచ్చిన ప్రజాప్రతినిధులు చేసిన శాశ్వత అభివృద్ధి పనులు చేసిన దాఖలాలు లేవన్నారు. ఎవరి హయాంలో ఈ ప్రాంతం అభివృద్ధి చెందిందో ప్రజలు గుర్తించాలన్నారు. త్వరలో జరిగే ఎన్నికల్లో తిరిగి సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలన్నారు. ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా వేమిరెడ్డికి ఓటువేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు మేకపాటి అభినవ్‌రెడ్డి, జెడ్పీటీసీ మోది రామాంజనేయులు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జి.ఓబుల్‌రెడ్డి, జెడ్పీ కో–ఆప్షన్ గాజుల తాజుద్దీన్, జేసీఎస్ కన్వీనర్ కె.కృష్ణారెడ్డి, సర్పంచ్‌లు వెంకటేశ్వరరెడ్డి, గౌస్‌మొహిద్దీన్, వైఎస్ ఎంపీపీ మట్ల శాంతి, ఎంపీటీసీ జి.తిరుపతి, నాయకులు దస్తగిరి అహ్మద్, బి.జాషువా, ఖిల్జీ సలీం, జి.వెంగళరెడ్డి, ఎం.తిరుపతిరెడ్డి, ఎంఏ రియాజ్, సలీం, డి.చెన్నయ్య, కె.నరసింహారెడ్డి, దర్వేష్, నారపరెడ్డి, మట్ల రామయ్య, లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఘన స్వాగతం

ఉదయగిరిలోని ఇందిరానగర్, ఎస్సీ కాలనీ, సినిమాహాల్ సెంటర్లలో బుధవారం ఉదయం మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పార్టీ నేతలు, కార్యకర్తలతో కలిసి ఎన్నికల ప్రచారం చేశారు. అనంతరం ఆయా ప్రాంతాల్లో స్థానికుల సమస్యలు తెలుసుకునే నిమిత్తం 'రచ్చబండ' కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఆయా ప్రాంతాల్లో మేకపాటి రాజగోపాల్‌రెడ్డికి పార్టీ మండల అధ్యక్షుడు జీ ఓబులరెడ్డి, జిల్లా కో ఆప్షన్ సభ్యుడు గాజుల తాజుద్దీన్, మండల ఉపాధ్యక్షులు మట్ల శాంతి ఆధ్వర్యంలో అపూర్వ స్వాగతం పలికారు. మహిళలు దిష్టి తీసి, బొట్టు పెట్టి హారతులు ఇచ్చారు. పుర వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయా ప్రాంతాల్లో స్థానికులతో కలిసి రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. స్థానికులతో మమేకమై వారి సాధక బాధలు ఆరా తీశారు. ప్రభుత్వ పరంగా అందిన లబ్ధి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యాలయం ప్రారంభం



పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ, అధ్యక్షుడు

ఉదయగిరి: స్థానిక పంచాయతీ బస్టాండ్ సమీపంలోని అన్నపూర్ణ కాంప్లెక్స్‌లో బుధవారం జెడ్పీటీసీ మోది రామాంజనేయులు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గానుగపెంట ఓబుల్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తల సౌకర్యార్థం పార్టీ కార్యాలయం ప్రారంభించడం జరిగిందన్నారు. అనంతరం స్వీట్లు పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు సయ్యద్ గౌస్‌మొహిద్దీన్, కల్లూరి వెంకటేశ్వరరెడ్డి, నాయకులు కె.నరసింహారెడ్డి, దర్వేష్, యు.హరి, డీ చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలు



సచివాలయాన్ని ప్రారంభిస్తున్న మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

- మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

సీతారామపురం (ఉదయగిరి): ప్రభుత్వం చేపట్టిన సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలు అందుతున్నాయని ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని పబ్బులేటిపల్లి సచివాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గతంలో ఏ చిన్నపని కావాలన్నా మండల కార్యాలయాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదని, సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన వెంటనే మండల వ్యవస్థను గ్రామ స్థాయికి తీసుకొచ్చారన్నారు. దీంతో ప్రజలకు వ్యయ ప్రయాసలు తగ్గాయన్నారు. రాష్ట్రంలో సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ వివిధ సంక్షేమ పథకాలు కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అందుతున్నాయన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో సామాజిక పింఛన్ల కోసం జన్మభూమి కమిటీల దయాదాక్షిణ్యాలపై ఆధారపడాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. ప్రస్తుతం పింఛన్లు అందుకు భిన్నంగా అర్హతే ప్రాతిపదికన అందుతున్నాయన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు మంచి, చెడు ఆలోచించి తమ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. పొరపాటున వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాకపోతే 2014 నుంచి 2019 వరకు జరిగిన టీడీపీ అవినీతి, విధ్వంస పాలన చూడాల్సిన పరిస్థితి ఉంటుందన్నారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండి వారికి కావాల్సిన సేవలు అందించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు చింతంరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, జెడ్పీటీసీ చెరుకుపల్లి రమణారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు బసిరెడ్డి కృష్ణారెడ్డి, మాజీ మండలాధ్యక్షుడు నేలటూరి అబ్రహం, అయ్యవారిపల్లి సర్పంచ్ దుగ్గయ్య, నేతలు పీసీ అల్లూరురాజు, పాశెం రమణయ్య, మద్దినేని శ్రీనివాసులు, కాశయ్య పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్‌కు ఉర్దూ విద్యార్థులు

ఉదయగిరి: జిల్లా స్థాయిలో జరిగిన సైన్స్ ఇన్‌స్పైర్ మనక్‌లో ఉదయగిరి బీసీ ఉర్దూ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనపరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు పాఠశాల ఉపాధ్యాయుడు అరాఫత్ తెలిపారు. బుధవారం పాఠశాలలో రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులను అభినందించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 18న రాష్ట్ర స్థాయిలో జరిగే సైన్స్ ఫెయిర్‌లో విద్యార్థులు పాల్గొని ప్రథమ స్థానంలో నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు భారత్ బంద్‌ను జయప్రదం చేయండి

ఆత్మకూరు: కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతు వ్యతిరేక చర్యలకు నిరసనగా సీపీఎం, సీపీఐ కార్మిక సంఘాలు, రైతు సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 16న జరిగే గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని ఆయా పార్టీల నాయకులు కోరారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఆయా పార్టీల నాయకులు, కార్మిక, రైతు సంఘాల నాయకులు బుధవారం రాత్రి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డేవిడ్ రాజు, టి లక్ష్మీపతి, షేక్ సంధానీ, ఏ నాగయ్య, లక్కు ప్రసాద్, శివప్రసాద్, హజరత్తయ్య, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

వైఎస్సార్‌సీపీలో టీడీపీ కుటుంబాల చేరిక

కావలి: మండలంలోని ఆముదాలదిన్నె చెందిన 50 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో బుధవారం ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి సమక్షంలో చేరారు. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీలోని ప్రతి కార్యకర్తకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. పార్టీలో పలువురు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలతో పేద కుటుంబాలు బాగుపడుతున్నాయన్నారు. ఇన్నేళ్లలో ఇటువంటి గొప్ప పరిపాలన చూడలేదని, వైఎస్సార్‌సీపీ పాలనపై సంతృప్తితో ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ డైరెక్టర్ కాటా శ్రీనివాసులురెడ్డి, ఆముదాలదిన్నె సర్పంచ్ ఉడా బ్రహ్మానందం, మాజీ జెడ్పీటీసీ కందుల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి



సిబ్బందితో సమీక్షిస్తున్న నోడల్ అధికారి దయాకర్

ఉదయగిరి: ప్రభుత్వ వైద్యశాలల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవల జిల్లా నోడల్ అధికారి దయాకర్ అన్నారు. ఆయన బుధవారం మండలంలోని గండిపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలల్లో కాన్పుల శాతం పెంచాలన్నారు. ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించేందుకు పీహెచ్‌సీల్లో 24 గంటలు వైద్యసేవలు అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, హైరిస్క్ గర్భిణులను గుర్తించి వారి ఇళ్లకు వెళ్లి వైద్య సేవలందించాలన్నారు. ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్‌భారత్ కార్డులు పంపిణీ పూర్తి చేయాలన్నారు. ఏఎన్‌ఎంలు యాప్‌ల నిర్వహణ సమర్థవంతంగా చేపట్టాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు. అనంతరం రికార్డులు పరిశీలించి సిబ్బందికి సూచనలందించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు శివకల్పన, వినీత, ఆరోగ్య బోధకుడు వెంకటసుబ్బయ్య, సీహెచ్‌ఓ శివకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

గృహ నిర్మాణశాఖ అధికారుల విచారణ



విచారణ చేపడుతున్న ఈఈ దయాకర్

సంగం: మండలంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు తెలియకుండా వారి లాగిన్ నుంచి సిమెంట్ సీఆర్‌ఓలు నమోదు చేసి లబ్ధిదారులకు ఇవ్వలేదని ఏఈ కరిముల్లాపై వచ్చిన ఆరోపణలపై బుధవారం గృహ నిర్మాణశాఖ ఈఈ దయాకర్ విచారణ చేపట్టారు. మండలంలోని ఏడుగురు ఇంజినీరింగ్ అసిస్టెంట్ల నుంచి సుమారు 3 వేలకు పైగా సిమెంట్ బస్తాలకు సంబంధించిన సీఆర్‌ఓలు వారికి తెలియకుండానే వారి లాగిన్ నుంచి తీసుకున్నట్లుగా ఇంజినీరింగ్ అసిస్టెంట్లు గత ఎంపీడీఓ గోపికి ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదును గోపి జిల్లా అధికారులకు సిఫార్సు చేశారు. దీంతో ఏఈ కరిముల్లా, ఇంజినీరింగ్ అసిస్టెంట్లను డీఈ ముక్తార్‌తో కలిసి విచారించారు.

ముమ్మరంగా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ



రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న డీటీ నాగలక్ష్మి

అల్లూరు: జగనన్న లేఅవుట్ల ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముమ్మరంగా జరుగుతోందని డీటీ నాగలక్ష్మి తెలిపారు. బుధవారం అల్లూరు నగర పంచాయతీ పరిధిలోని నార్త్‌మోపూర్ సచివాలయం పరిధిలో జరుగుతున్న రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఆమె పరిశీలించారు. నార్త్‌మోపూర్‌లో మొత్తం 148 లబ్ధిదారులకు గాను ఇప్పటి వరకు 131 మందికి రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేశామన్నారు. మిగిలిన 17 కూడా త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వరప్రసాద్, డిజిటల్ అసిస్టెంట్ తిరుమలేష్ పాల్గొన్నారు.

దామోదరం సంజీవయ్యకు నివాళి



ఆత్మకూరు: సంజీవయ్య చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ఎంవీఐ రాములు

ఆత్మకూరు: ఉమ్మడి రాష్ట్ర మాజీ సీఎం దామోదరం సంజీవయ్య జయంతిని ఆత్మకూరు రవాణాశాఖ కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఎంవీఐ రాములు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

జలదంకి: స్థానిక తహసీల్దార్ కార్యాలయలంలో బుధవారం దివంగత మాజీ సీఎం దామోదరం సంజీవయ్య జయంతిని ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ ఎస్.వాసు, సిబ్బంది సంజీవయ్య చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డీటీ భరత్, వీఆర్వోలు పాల్గొన్నారు.

చేజర్ల: ఉమ్మడి ఏపీ మాజీ సీఎం దామోదరం సంజీవయ్య జయంతిని బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ గోపికృష్ణ, ఆర్ఐ సుమతి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వసంత పంచమి



సరస్వతీదేవికి పూజలు నిర్వహిస్తున్న విద్యార్థులు

మర్రిపాడు: చదువుల తల్లి సరస్వతీదేవి జన్మదినం సందర్భంగా వసంత పంచమి వేడుకలను చుంచులూరు ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు సరస్వతీదేవికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుధాకర్ మాట్లాడుతూ చదువుల తల్లి సరస్వతీదేవి అనుగ్రహంతో విద్యార్థులందరూ బాగా కష్టపడి చదివి మంచి మార్కులు సాధించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



బోడిపాడు పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ గోపీకృష్ణ

చేజర్ల: వచ్చే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ గోపీకృష్ణ పరిశీలించారు. బుధవారం మండలంలోని బోడిపాడు, ఏటూరు, నెర్నూరు, కొలపనాయుడుపల్లి నూతక్కివారికండ్రిక పోలింగ్ కేంద్రాలను పరిశీలించి, మౌలిక వసతుల విషయంపై ఆరా తీశారు. రోడ్డు మార్గం, కరెంట్, నీటివసతి ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు.

కలిగిరిలో మేకపాటి పర్యటన

కలిగిరి: ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి బుధవారం కలిగిరిలో పర్యటించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నేత పుల్లా రవి ఏర్పాటు చేసిన శ్రీలక్ష్మీనరసింహ టైర్స్ షాపును ప్రారంభించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో ముచ్చటించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పాలూరు మాల్యాద్రిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కాటం రవీంద్రారెడ్డి, సర్పంచ్ రాగి దివ్య, ఉప సర్పంచ్ పాలూరు కొండారెడ్డి, ఈఓపీఆర్డీ వెలుగోటి మధు, పంచాయతీ వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.